క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని బీజేపీ మాసాయిపేట మండల అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని పోతాన్‌పల్లి, చెట్ల తిమ్మాయిపల్లిలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, బాబు, రవికిరణ్, నరేందర్, రాజు, నరేశ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కరెంటు స్తంభం


ఒరిగిన విద్యుత్ స్తంభం

నర్సాపూర్: మండల కేంద్రంలోని రాయరావు చెరువును ఆనుకుని ఏర్పాటు చేసిన కరెంటు స్తంభం ఒక వైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. గత కొంతకాలంగా కరెంటు స్తంభం ఒక పక్కకు ఒరిగినా మరమ్మతులు చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నా సరి చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభానికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు


పిల్లుట్లలో కూలిన ఇల్లు

శివ్వంపేట(నర్సాపూర్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నివాస గృహాలు దెబ్బతిన్నాయి. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో నివాస ఇళ్లు కూలిపోవడంతో పాటు పలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ మేరకు కూలిపోయిన ఇళ్ల వివరాలు తెలియజేయాలని తహసీల్దార్ కమలాద్రి సూచించారు.

కూలిన బురుజు


కూలిన బురుజు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో గత మూడు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. ఈ వర్షం కారణంగా మంగళపర్తిలో ఉన్న పురాతన బురుజు కూలింది. అయితే ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. పురాతన బురుజు తిరిగి పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నియామకం


సన్మానిస్తున్న రెడ్డి సంఘం సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని నవాబుపేటలో రెడ్డి సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రిటైర్డ్ టీచర్ ఏనుగు నర్సరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయనను సభ్యులు ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు.

భగత్‌సింగ్‌కు నివాళి

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్ర పోరాటంలో భగత్‌సింగ్ ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, చేగుంట, నార్సింగి మండలశాఖ అధ్యక్షులు వెంకటేశ్, స్వామి, కృష్ణమూర్తి, దేవానంద్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’కు మోక్షమెప్పుడో!

- ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పనులు
- నర్సాపూర్‌కి ఐదు వందల డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు


నర్సాపూర్‌లో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

నర్సాపూర్: నత్తకే నడక నేర్పిన చందంగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో డబుల్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి ఎనిమిదేళ్లు గడుస్తున్నా నేటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. ప్రభుత్వం సొంతింటి ఇంటి కల నెరవేరుస్తామని చెప్పడంతో ఇళ్లు లేని పేదలు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే కొంతమందికి ఇళ్లు మంజూర్వవగా.. మరికొంత మంది వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చేపట్టిన డబుల్ ఇళ్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. అయితే తాజాగా, ఇళ్లను పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇళ్ల పంపిణీ నిలిచిపోయే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

252 ఇళ్ల నిర్మాణాలు పూర్తి..

గత ప్రభుత్వ హయాంలో నర్సాపూర్‌కు ఐదు వందల డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయి. పట్టణం నుంచి వెల్దుర్తి మార్గంలో రోడ్డు పక్కన 252 ఇళ్లకు, రోడ్డుకు అవతలి వైపు 224 ఇళ్లకు నిర్మాణ పనులు చేపట్టగా.. 24 ఇళ్లకు నిర్మాణ పనులు చేపట్టలేదు. ఒక్కో బ్లాకును జీ ప్లస్ టూగా నిర్మాణాలు చేపట్టారు. ఇందులో 252 ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం 224 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇందులో కొన్ని బ్లాకులు గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ స్థాయిలోనే ఉండడం గమనార్హం. నిర్మాణం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయడంతో పాటు అసంపూర్తిగా ఉన్న ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మార్పు చేసి పేదలకు అందజేయాలని కోరుతున్నారు. అయితే నిర్మాణంలో ఉన్న ఆయా ఇళ్ల నిర్మాణ పనులు లబ్ధిదారులే చేపట్టి పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చును ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద బిల్లులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.


నర్సాపూర్‌లో వివిధ నిర్మాణ దశల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు

అడ్డంకిగా స్థానిక సంస్థల ఎన్నికలు?

అక్టోబర్ నాటికి పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేసేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఈనెలాఖరు నాటికి స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. దీంతో నర్సాపూర్‌లో డబుల్ ఇళ్ల పంపిణీకి ఎన్నికల ప్రక్రియ అడ్డంకిగా మారవచ్చని అంటున్నారు. ఒకవేళ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ప్రభుత్వ పథకాలు పంపిణీ చేసే అవకాశం ఉండదు. దీంతో ఎన్నికల అనంతరం డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, నర్సాపూర్‌లో 1,087 మందికి సొంత ఇంటి స్థలం లేదని ప్రభుత్వం గుర్తించింది. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద సొంత ఇంటి స్థలం ఉన్న వారికి మొదటి దఫా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా.. స్థానిక మున్సిపాలిటీలోని 327 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 125 మంది ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టగా.. మిగిలిన వాటికి నిర్మాణ పనులు చేపట్టలేదు.

స్వాధీనం చేసుకుంటాం

నర్సాపూర్‌లో నిర్మాణం పూర్తయిన 252 డబుల్ బెడ్రూం ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అసంపూర్తిగా ఉన్న వాటిని తర్వాత స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఈ డబుల్ ఇళ్ల పంపిణీ ప్రక్రియతో తమకు సంబంధం లేదు.

– భాస్కర్, పీఆర్ ఏఈ

పెంపుడు కుక్కలకు ‘రేబిస్’ వ్యాక్సిన్

చిన్నశంకరంపేట(మెదక్): పెంపుడు కుక్కలకు ప్రతి ఒక్కరూ రేబిస్ నివారణ వ్యాక్సినేషన్ చేయించాలని వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ గీతామాలిక సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదకరమైన రేబిస్ నుంచి రక్షణకు ప్రతి ఒక్కరు పెంపుడు కుక్కలకు రేబిస్ నివారణ వ్యాక్సినేషన్ చేయించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ గీతామాలిక

రాకపోకల నిలిపివేత

టేక్మాల్(మెదక్): మెదక్–బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై ఎల్లాపూర్ బ్రిడ్జిపై నుంచి మంజీరానది పారుతోంది. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఐ రాజేష్ ఆధ్వర్యంలో రాకపోకలను నిలిపివేశారు. బొడ్మట్‌పల్లి నుంచి మెదక్ వెళ్లే ప్రయాణికులను పోలీసులు బోర్డు ఏర్పాటు చేసి వాహనాలను మళ్లించారు. నీటి ఉధృతి తగ్గే వరకు రాకపోకలు కొనసాగవని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.


బొడ్మట్‌పల్లి వద్ద బోర్డు పెట్టిన పోలీసులు

వయో వృద్ధులను గౌరవించాలి


వయో వృద్ధులను సన్మానిస్తున్న సభ్యులు

నర్సాపూర్ రూరల్: వయో వృద్ధులను గౌరవించాలని రెవరెండ్ సందీప్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగులపల్లి సీఎస్‌ఐ చర్చిలో వయో వృద్ధులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దలను గౌరవించడంతోపాటు సలహాలు తప్పకుండా పాటించాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో సమయంతో పోటీ పడాల్సి వస్తుందని, ఈ సమయాన్ని వయో వృద్ధులు, తల్లిదండ్రుల కోసం కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఐ నూతన కమిటీ సభ్యులు ఇమ్మానుయేల్, కరుణాకర్, కనకరావు, యూత్ సెక్రటరీ శ్రీనివాస్, చర్చి భక్తులు పాల్గొన్నారు.

వరిలో ఆకు ఎండు తెగులు

- సస్యరక్షణతోనే పంటను కాపాడుకోవాలి
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలోని పలు గ్రామాల్లో వరి పంటను ఎండు ఆకు తెగులు ఆశిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నాయి. అయితే సకాలంలో స్పందించి రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే పంట నష్టాన్ని నివారించవచ్చని తునికి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో తెగులును పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.

సస్యరక్షణ చర్యలు..

జిల్లాలో ప్రస్తుతం వరి పంట చిరుపొట్టదశతో పాటు ముందుగావేసిన పంట ఈనె దశలో ఉంది. దీంతో పంటకు బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు ఆశిస్తుంది. అలాగే వరిపంటను ఆలస్యంగా వేసిన పొలంలో సైతం తెగులు ఆశించే అవకాశం ఉంది. ఈ తెగులు సన్నరకం పంటలో ఎక్కువగా కనిపిస్తుంది. దీనికి నివారణకు మందులు లేనందున సకాలంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపడితే నష్టాన్ని తగ్గించుకోవచ్చు.

లక్షణాలు, కారణాలు..

వరి పంటను తెగులు ఆశిస్తే ఆకుల మీద పసుపు రంగు నీటి మచ్చలు ఏర్పడి అంచుల వెంట పై నుంచి కింది వరకు వ్యాప్తి చెందుతుంది. పంటను ఉదయం గమనిస్తే ఆకుల నుంచి పచ్చని జిగురు పదార్థం కనిపిస్తుంది. అయితే సూర్యరశ్మికి గట్టిపడి చిన్న ఉండలుగా మారి గాలి వీస్తే నీటిలో పడి ఇతర మొక్కలు, పొలాలకు వ్యాపిస్తుంది. అయితే గాలిలో తేమశాతం ఎక్కువగా ఉండడం, ఎడతెరిపిలేని చిరుజల్లులు కురవడం, గాలివేగంగా వీయడం వంటి కారణాలతో తెగులు సోకుతుంది. అదే విధంగా తెగులును తట్టుకునే శక్తిలేకపోవడంతో త్వరగా వ్యాపించి పంటను నష్టం చేస్తుంది. దీంతో దిగుబడి తగ్గి రైతులకు నష్టం వస్తుంది. రైతులు నత్రజని ఎరువులను ఎక్కువగా వాడటంతో వ్యాప్తి చెందే తీవ్రత పెరుగుతుంది.


వరిపంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్

నివారణ చర్యలు..

వరిని బ్యాక్టీరియా ఎండు తెగులు 5శాతం కన్న ఎక్కువగా పంటను ఆశిస్తే నత్రజని వేయడం తాత్కాలికంగా ఆపివేయాలి. తెగులు సోకిన పొలం నుంచి ఇతర పొలాలకు నీరుపారకుండా చూడాలి. చివరి విడతలో పొటాష్ ఎరువును ఎకరాకు 15కిలోలు చల్లుకోవాలి. దుబ్బకట్టె దశ నుంచి చిరుపొట్టదశలో తెగులు గమనిస్తే అగ్రిమైసిన్ 80గ్రాములు, లేదా ప్లాంటామైసిన్ లేదా పోషమైసిన్ 40గ్రాములు రెండుసార్లు పిచికారీ చేయాలి. పంటకు నీరు ఎక్కువగా పెట్టవద్దు. దీంతో తెగులు వ్యాప్తిని అరికట్టవచ్చు.

పందులతో పరేషాన్

రేగోడ్(మెదక్): స్వచ్ఛ గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం రూ.లక్షల్లో మంజూరు చేస్తున్నా నేటికీ పలుచోట్ల అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో పందులు రోజూ సంచరిస్తున్నాయి. ఇష్టానుసారంగా పందులు తిరుగుతుండంటంతో రాత్రి సమయాల్లో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో అపరిశుభ్రత ఏర్పడి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు చిన్నారులపై దాడి చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


నివాస గృహాల సమీపంలో పందుల సంచారం

చిత్తూచిత్తుల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మ

ఘనంగా బతుకమ్మ సంబరాలు

జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలు, బుట్టలతో అల్లిన కాగితం బతుకమ్మలతో మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడుతూ వేడుకలు చేసుకున్నారు. మహిళలంతా ఒకే చోట చేరి బతుకమ్మ ఆడటం చూపరులను కనువిందు చేసింది. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.


టేక్మాల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


చండూర్‌లో బతుకమ్మ వేడుకల్లో గ్రామస్తులు


మాధవనగర్‌లో బతుకమ్మ వేడుకలు


నిజాంపేట: కల్వకుంటలో ..


రామోజిపల్లిలో బతుకమ్మ వేడుకలు

విజయానికి ప్రతీక.. దసరా

మెదక్ కలెక్టరేట్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా ఉత్సవాలు నిర్వహించుకుంటారని యోగా గురు రవి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తారకరామనగర్‌నగర్ కాలనీలో ఆర్ఎస్ఎస్ మెదక్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవం నిర్వహించారు. దసరా ఉత్సవంలో శక్తి సముపార్జన చేసి గెలుపు కోసం పనిచేస్తారన్నారు. అనంతరం ఆర్ఎస్ఎస్ జిల్లా కుటుంబ ప్రబోధన్ కొట్టూరి కాశీనాథ్ వక్తగా హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పీఎం డ్రైవ్‌లో కార్యక్రమం నిర్వహించారు. అలాగే సంఘ శతాబ్ది సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నగరం బస్తీల వారిగా ఉత్సవాలు చేయాలని పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐదు వార్డుల సభ్యులు పాల్గొన్నట్లు తెలిపారు.


ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవం

ఘనంగా చండీ హోమం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి మండపంలో ఆదివారం ఘనంగా చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ, పరంజ్యోతిల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అనంతరం దేవి నవరాత్రులకు సంబంధించిన అవతరణలపై పూజారి వాసుదేవచారీ భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భవానీ మాత దీక్ష భక్తులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చేగుంటలో చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

మహాలక్ష్మీ నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


పెద్దశంకరంపేట: వీరోజిపల్లిలో అమ్మవారి పూజల్లో భక్తులు


కౌడిపల్లి: తునికి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో నల్లపోచమ్మదేవి


చిట్కుల్: చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


నర్సాపూర్: ధర్మశాలలో మహాలక్ష్మీదేవిగా దర్శనం ఇచ్చిన దుర్గామాత


టేక్మాల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


అల్లాదుర్గం: కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు


శివ్వంపేట: పిల్లుట్లలో అన్నదానం


శివ్వంపేట: చండీలో చండీకాంబ దేవి అలంకరణ


చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో లలితా త్రిపుర సుందరిదేవిగా దుర్గామాత దర్శనం


కౌడిపల్లి: రాయిలాపూర్‌లో భజన చేస్తున్న మాలాధారులు


రంగంపేటలో బోనాల ఊరేగింపు